## రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: ఈ నెల 11న ఉమ్మడి గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పరీక్షకు వచ్చేటప్పుడు హాల్ టికెట్, బ్లూ,బ్లాక్ పెన్, ఆధార్‌కార్డు, వాటర్ బాటిల్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులు వెంటనే చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## నేడు పది విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం

కౌటాల, ఫిబ్రవరి 9: మండలంలోని పదో తరగతి విద్యార్థులకు శనివారం మండల కేంద్రంలోని జగదాంబా ఫంక్షన్ హాలులో వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ ప్రాజెక్టు ద్వారా మోటివేషన్ తరగతులు నిర్వహించనున్నట్లు వేకువ ఫౌండేషన్ కన్వీనర్ మార్త రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని యాజమాన్యాల పదో తరగతి విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. దీని ద్వారా పది పరీక్షల సమయంలో ఎలా రాయాలి, ఎలాంటి ప్రశ్నలు వస్తాయి, ఎలా జవాబులు రాయాలి, భయాందోళనలకు గురి కాకుండా ఎలా ఉండాలి, ఎలా చదవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు తమ వెంట నోట్ బుక్, పెన్, ప్యాడ్ తీసుకురావాలని ఆయన సూచించారు.

## రైతులకు ఉపయోగపడే పనులే చేపడుతాం

తిర్యాణి, ఫిబ్రవరి 9: ఉపాధి హామీ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాగు భూముల అభివృద్ధి కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి రైతులకు అవసరమైన పనులను మాత్రమే చేపట్టనున్నట్లు ఈజీఎస్ ఏపీవో శాకీర్ ఉస్మానీయా, ఈసీ రజిత తెలిపారు. రాళ్లకట్టలు, భూమి చదును, పాంఫండు,మట్టికట్టలు, నీటి నిల్వ కుంటలు,కాల్వల్లో పూడికతీత తదితర 204 రకాల పనులు గుర్తించినట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎవరైతే భూ అభివృద్ధి కోసం దరఖాస్తులు చేసుకొని రైతులు సంబంధిత ఈజీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

రెబ్బెన, ఫిబ్రవరి 9 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కొమురవెల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా రహదారి పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు పంట పొలాలకు వెళ్లు దారులు బాగుండలంటే రహదారులు ఏర్పాటు చేసుకొవాలని అందులో భాగంగానే ఉపాధిహామీ పథకంలో పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మంజుల, ఎంపీటీసీ దుర్గం రాము, పంచాయతీ కార్యదర్శి రవి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, ఆసిఫాబాద్ మండలాధ్యక్షుడు మసాడి చరణ్, నాయకులు పెద్దింటి శ్రీకాంత్, కమల్ పలువురు ఉన్నారు.

## కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

రెబ్బెన, ఫిబ్రవరి 9: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 7న ప్రారంభమైన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం కొనసాగుతున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ట్యాంక్‌లు శుభ్రం చేయడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించడం లాంటి పనులు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. శుక్రవారం నవేగాం ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం నిర్వహించి చెత్తా చెదారం తొలగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ మాధవి, పలువురు పాల్గొన్నారు.

## పంటల వివరాలను నమోదు చేసుకోవాలి

కౌటాల, ఫిబ్రవరి 9 : యాసంగిలో వేసిన పంటల వివరాలను సంబంధిత ఏఈవోల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ సూచించారు. శుక్రవారం మండలంలోని గుండాయిపేట శివారులో యాసంగి పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. వేసిన ప్రతి పంట వివరాలను తప్పకుండా ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. నిర్దేశించిన 15 సర్వే నంబర్‌లలోని పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. యాసంగి పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచించారు. ఆయన వెంట గుండాయిపేట క్లస్టర్ ఏఈవో చౌదరి అంజన్న, రైతులు ఉన్నారు.

# చెరుకు సాగు భలే బాగు

- పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ

ధనోరలో రైతు సాగు చేస్తున్న చెరుకు తోట

చెరుకు రసం తీస్తున్న రైతు మహ్మద్ ముక్ర

కెరమెరి, ఫిబ్రవరి 9: చెరుకు ఆరోగ్యానికే కాదు.. రైతుకు తగిన ఆదాయాన్నిస్తోంది. ఒక్కసారి విత్తనం నాటి తోట సాగు చేస్తే 3 నుంచి నాలుగేళ్లు పంట వస్తుంది. ఏడాదికోసారి వచ్చే ఈ పంటకు రెండుసార్లు ఎరువులు, నెలకు రెండుసార్లు నీరందిస్తే చాలు ఎలాంటి అదనపు ఖర్చు, అంతగా శ్రమపడే అవసరం లేదు. ధనోర గ్రామానికి చెందిన రైతు మహ్మద్ ముక్ర తనకు సొంత చేను లేకపోయినా ఆరేళ్ల నుంచి భూమిని కౌలుకు తీసుకొని ఇతర పంటలు పండిస్తూనే చెరుకు సాగు చేస్తున్నాడు. తోటలో పండించిన చెరుకును విక్రయించకుండా తానే ప్రధాన రహదారి పక్కన చెరుకు జ్యూస్ అమ్ముతూ అధిక లాభాలు పొందుతున్నాడు. మహ్మద్ ముక్ర మహారాష్ట్రలోని లాతుర్ ప్రాంతవాసి. అక్కడ 90 శాతం రైతులు చెరుకు సాగు చేయడం చూసి ఆయనలో పట్టుదల పెరిగింది. కొన్నేళ్ల క్రితం తమ బంధువులైన కెరమెరి మండలంలోని ధనోర గ్రామానికి వచ్చాడు. ఇక్కడే నివాసముంటూ రహదారి పక్కన భూమిని కౌలుకు తీసుకున్నాడు. సుమారు 10 ఎకరాలున్న భూమిలో పప్పు దినుసులు, కూరగాయలు, మక్కజొన్న వంటి పంటలు పండిస్తూనే చెరుకు సైతం సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ముందుగా ఎకరం భూమిలో రూ.25 వేలు పెట్టుబడితో చెరుకు విత్తనాలు తెచ్చి నాటాడు. సకాలంలో నీళ్లు, ఎరువులు వేయడంతో పంట అద్భుతంగా వచ్చింది. అప్పటి నుంచి ఆయన చెరుకు తోటను సాగు చేస్తూ ఏడాదికి రూ. 40వేలకు పైగా ఆదాయాన్ని పొందుతున్నాడు.

### ఎక్కువ విస్తీర్ణంలో చెరుకు పండించాలి

చెరుకు సాగుపై రైతుల్లో ఆసక్తి కలిగి తోట విస్తీర్ణం పెరిగితే బెల్లం సైతం ఇక్కడే తయారు చేయవచ్చు. ఇక్కడి రైతులు పత్తి, కందులు, జొన్న, మక్కజొన్న, పెసర, మినుములు వంటి పంటలు మాత్రమే పండిస్తున్నారు. ఇది తప్ప చెరుకు సాగుపై అవగాహన లేదు. ప్రభుత్వం రైతులకు చెరుకు పంటపై శిక్షణ అందించి సాగుచేసేలా చూడాలి. కనీసం 10ఎకరాల్లో చెరుకు విస్తీర్ణం పెరిగితే బెల్లం తయారు చేసే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంత రైతులకు లాభం కలగడంతో పాటు ఇక్కడి ప్రజలకు బెల్లం అందుబాటులోకి వస్తుంది.

- మహ్మద్ ముక్ర, చెరుకు రైతు ధనోర(కెరమెరి)

# ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

- ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ సంఘం నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్టీయూ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, ప్రకాశ్ అన్నారు. శుక్రవారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆ సంఘ భవనం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడారు. 9 ఫిబ్రవరి 1972 న స్వర్గీయ శ్రీ సామల యాదగిరి స్థాపించిన సంఘం అంచెలంచెలుగా ఎదిగి నేడు 75 వేల ప్రాథమిక సభ్యత్వంతో రాష్ట్రంలో నిలించిందన్నారు. పెండిగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, 317 ద్వారా వచ్చిన ఇతర జిల్లాల ఉపాధ్యాయులు సొంత జిల్లాలకు బదిలీలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ,ఐటీడీఏ, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్కేల్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఉదయబాబు , గడ్డం భిక్షపతి తోపాటు పలువురు సీనియర్ ఉపాధ్యాయులను, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇందారపు ప్రకాశ్, పీ.సాంబశివరావు, రాంటెంకి దేవాజీ, రాంటెంకి బాబురావు, నరులే ప్రకాశ్, జాదవ్ సంతోష్, లకావత్ శంకర్, ఎనుగంటి భిక్షపతి, చునార్కర్ అనిల్, ఉప్రే వినేశ్, రతన్ గైన్, పత్తిపాక శ్రావణ్, చునార్కర్ అనిల్, సత్యనారాయణ, లెవన్‌కుమార్, జటోత్ గోవింద్, చునార్కర్ చైతన్యకుమార్, విజయేశ్ ,కృష్ణమూర్తి, వివేక్, ప్రశాంత్, దినేశ్, సంతోష్, చరణ్, రాకేశ్ గుప్తా, వినయ్, ప్రభాకర్, సత్యనారాయణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయండి

సమ్మె పోస్టర్లను విడుదల చేస్తున్న బోగె ఉపేందర్, నాయకులు

రెబ్బెన, ఫిబ్రవరి 9 : దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని గోలేటి ఎక్స్ రోడ్‌లో శుక్రవారం సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, సింగరేణిలో ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని, బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియ వెంటనే ఆపి సింగరేణికి కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, కార్యదర్శి లక్ష్మినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, కార్మికులు సత్తయ్య, శ్రీనివాస్, తిరుపతి, రవి పలువురు ఉన్నారు.

## క్షేత్రస్థాయి పరిశీలన

దహెగాంలో దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్

దహెగాం, ఫిబ్రవరి 9 : ప్రజాపాలన గ్రామసభల్లో ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పుగా నింపిన వారి ఫారాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం దహెగాం గ్రామపంచాయతీలో పరిశీలన చేసి గ్యాస్ కనెక్షన్‌కు అప్లయ్ చేయని వారు. ఆధార్, రేషన్, కంజూమర్ నంబర్లు తప్పుగా నింపిన వారి దరఖాస్తులను పరిశీలించి సవరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు సమయపాలన పాటించాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్
- గోలేటి జీఎం కార్యాలయంలో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం

గోలేటి జీఎం కార్యాలయంలో మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన, ఫిబ్రవరి 9: సింగరేణి ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ నిజాయతీగా విధులు నిర్వహించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ పేర్కొన్నారు. గోలేటి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ అధికారులు సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాలకు సింగరేణి సంస్థను అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంస్థ సాధించిన లక్ష్యాలు, భవిష్యత్ లక్ష్యాలు, లక్ష్యాల సాధనకు పనితీరు, ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఉద్యోగులు, యంత్రాల పనితీరు గణాంకాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సంస్థ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై ఉద్యోగుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, జీఎం కార్యాలయంలోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్,ఫిబ్రవరి9 : కేసుల దర్యాప్తులో మరింత వేగం పెంచాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేరసమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోక్సో, ఎస్సీ,ఎస్టీ కేసులను 60 రోజుల్లో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. రౌడీలు, కేడీలు, సస్పెక్ట్‌ల కదలికలపై నిరంతరం నిఘాపెట్టాలని చెప్పారు. ప్రతి కేసులో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. విజిబుల్ పోలిసింగ్‌లో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాహనాలు తనిఖీ చేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సీసీటీఎన్ఎస్‌లో డేటా ఎంట్రీ ప్రతిరోజూ మానిటర్ చేయాలని సంబంధిత ఎస్ఐలకు సూచించారు. సీసీ కెమెరాలను ప్రతిరోజూ మానిటర్ చేయాలని, పని చేయని సీసీ కెమెరాలను వెంటనే బాగు చేయించాలని సూచించారు. సైబర్ నేరాలపై పల్లెల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, డీసీఆర్బీ డీఎస్పీ రమేశ్, స్పెషల్ బ్రాంచ్, టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్బీ సీఐ రమేశ్, సీఐలు, ఎస్ఐలు, డీపీవో పాల్గొన్నారు.

- బాధ్యతగా పని చేస్తేనే గుర్తింపు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: బాధ్యతాయుతంగా పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. ఆసిఫాబాద్, రెబ్బెనలో సీఐలుగా విధులు నిర్వహించిన రాజు, నరేందర్ బదిలీ కావడంతో వారిని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీ అనేది సహజం అని, ఉద్యోగం ఎక్కడ చేసినా క్రమశిక్షణతో విధులు నిర్వహించడం ముఖ్యమన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, జిల్లాలో వివిధ ముఖ్యమైన బందోబస్తులను విజయవంతంగా పూర్తి చేయడంలో సీఐలు రాజు, నరేందర్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వరరావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, డీసీఆర్బీ డీఎస్పీ రమేశ్, సీఐలు, ఆర్ఐ లు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కమిటీ ఎన్నిక

తిర్యాణి, ఫిబ్రవరి 9 : మండలం కన్నేపల్లి పంచాయతీ పరిధిలోని చిన్న అరటిపల్లి సమీప అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షులు వెడ్మ కమల, చుంచు శ్రీనివాస్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అధ్యక్షుడిగా వెడ్మ భగవంతరావు, ఉపాధ్యక్షుడిగా మార్నేని తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా గుండం రారాజు, కోశాధికారిగా సిడాం తులసీరాం, కార్యవర్గ సభ్యులుగా రాయిసిడాం యశ్వంత్‌రావు, రాయిసిడాం భీంరావు,కామెర శంకర్,కోట్నాక జంగు,గేడెం శ్రీను, యేదుల తిరుపతి, మంగ రాజు, గేడెం రాంషా, తొంగల రాజుకుమార్‌లను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

## సెల్‌ఫోన్ అప్పగింత

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, ఫిబ్రవరి9: బెల్లంపల్లికి చెందిన హమీద్‌కు సంబంధించిన మొబైల్ ఈస్గాం నుంచి బెజ్జూర్ వెళ్లే మార్గంలో పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీస్‌లు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా ఈ మొబైల్స్ ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీంను అభినందించారు.

## వనదేవతలకు మొక్కులు

ఆసిఫాబాద్,ఫిబ్రవరి9 : సమ్మక్క-సారక్క వనదేవతలకు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో మొక్కలు తీర్చుకుంటున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో అమ్మవార్లకు బెల్లంతో తులభారం చేశారు. తమ కోర్కెలు తీరాలని అమ్మవార్లను వేడుకున్నారు.

## దుర్గాదేవి ఆలయంలో పూజలు

రెబ్బెన, ఫిబ్రవరి 9: మండలంలోని ఇందిరానగర్‌లో కొలువైన కనకదుర్గా దేవి ఆలయంలో శుక్రవారం జంగుబాయి మాలలు ధరించిన ఆదివాసీ మహిళా స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుచుకున్నారు. శుక్రవారం అమావాస్యను పురస్కరించుకొని అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఆదివాసీల ఇంటి దైవం అయిన నాగదేవతకు పూజలు చేయడంతో పాటు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్ స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు, దీవెనలు అందించారు.

## రేషన్ డీలర్‌పై కేసు

కౌటాల, ఫిబ్రవరి 9: మండలంలోని తుమ్డిహట్టి గ్రామ రేషన్‌డీలర్ శ్రీనివాస్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్యాంలాల్‌లు శుక్రవారం తెలిపారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు రేషన్‌షాపును తనిఖీ చేయగా 2.04 క్వింటాళ్ల బియ్యం ఎక్కువగా ఉన్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు డీలర్‌పై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు వారు తెలిపారు.

# ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 : పార్లమెంట్ ఎన్నికలకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి మాస్టర్ ట్రైనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సెక్టోరల్ అధికారులు, ప్రొసీడింగ్, అదనపు ప్రొసీడింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి ఎన్ని కల నియమావళి, విధుల నిర్వహణ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో జిల్లాలో పోలింగ్ కేంద్రాలు పెరిగాయన్నారు. సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున అందరికీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణపై అవగాహన కల్పించడం శిక్షకుల బాధ్యత అన్నారు. ఇప్పటికే సెక్టోరల్ అధికారులకు శిక్షణ ఇచ్చామని, అనంతరం ప్రొసీడింగ్, అదనపు ప్రొసీడింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది దికి శిక్షణ ఇవ్వాల్సి ఉన్నందున మాస్టర్ ట్రైనర్లు సిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ రోజున ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో సమస్య తలెత్తినట్లయితే పోలింగ్ ప్రక్రియలో అంతరాయం లేకుండా సెక్టోరల్, ప్రొసీడింగ్ అధికారులకు సిబ్బందికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ అందించాలని ఆదేశించారు. ప్రొసీడింగ్ డైరీలో ప్రతి సమాచారాన్ని నమోదు చేసే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, మాస్టర్ ట్రైనర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నాబార్డ్ డీడీఎం వీరభద్రరావు

- నాబార్డు డీడీఎం వీరభద్రరావు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 : ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నాబార్డు డీడీఎం వీరభద్రరావు అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవన జ్యోతి, సురక్ష బీమా పథకాలపై శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీఎం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల రుణాలు, వాటికి ఇస్తున్న వడ్డీ రాయితీల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంక్‌లో పొదుపు ఖాతా తప్పని సరిగా ఉండాలన్నారు. రైతులు వారికి వచ్చిన ఆదాయంలో కొంత డబ్బులను డిపాజిట్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్యాంక్ మేనేజర్ అనిల్ కుమార్, పీఎసీఎస్ చైర్మన్ అలీబిన్‌హెమద్, ఫీల్డ్‌అధికారి రాజేంద్ర కుమార్, డైరెక్టర్లు నారా ఆశన్న, మధుకర్, మురళికృష్ణ, శంకర్, దేవన్న, కార్యదర్శి వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం మండలంలోని కోసర గ్రామ పంచాయతీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. తరగతిలో బోధన ఉపకరణాలపై 1, 3 తరగతి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలోని జ్యూట్‌లో విద్యార్థుల స్థాయిని బట్టి పుస్తకాల అమరిక విధానాన్ని వివరించారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని, విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం గ్రామంలోని వాటర్ షెడ్ పథకం, పీఎంకే ఎస్‌వై 2-0 కింద చేపట్టే ఊట కుంట పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పథకం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఈపీఏ కింద చేపట్టిన కమ్యూనిటీ షెడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఇన్స్‌ఫైర్ మనక్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 : రాష్ట్రస్థాయి ఇన్స్‌ఫైర్ మనక్ పోటీలకు జిల్లా నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు తెలిపారు. ఇన్స్‌ఫైర్ మనక్ పోటీల్లో భాగంగా ఈనెల 7 ,8 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో 95 ప్రాజెక్టులు ప్రదర్శించగా వాటిలో 9 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యాయి. అక్షర పటేల్, జవహర్ నవోదయ విద్యాలయం కాగజ్‌నగర్, సోలంకి శాలిని, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్, సిర్పూర్ (టీ), లింగంపల్లి అక్షయ్, ప్రభుత్వ ఉన్నత పాఠశ